

లగ్గానికి వేళాయె..

సరిగ్గా 80 రోజుల తరువాత మళ్లీ శుభకార్యాలకు మంచి ముహూర్తాలు వచ్చాయి.

వివరాలు 8లో ▸



ఆటోను ఢీకొట్టిన లారీ

ఆటోను లారీ ఢీకొనడంతో పది మంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 8లో ▸

అంబులెన్స్ సేవలపై ఆరా

సంగారెడ్డి: ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ అంబులెన్స్‌ల పనితీరును ఆ సంస్థ అధికారులు శుక్రవారం పరిశీలించారు. అధికారులు దాన కిశోర్, రవీంద్ర జిల్లా కేంద్ర ఆసుపత్రి లోని 108, 102 అంబులెన్సులను తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. 108 కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. క్షతగాత్రులకు సరైన సమయంలో సేవలందించాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

సంత ఏర్పాటుకు స్థలం సేకరించండి

మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర

సంగారెడ్డి జోన్: మునిపల్లి మండలం కంకోల్‌లో కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో గ్రామ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంకోల్‌లో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరలో పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు



క్రీడలు ప్రారంభించిన న్యాయమూర్తి భవానీ చంద్ర

సంగారెడ్డి టౌన్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఉపయోగపడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాని ఉత్తేజపరుస్తాయని, క్రీడలు ఆడటంతో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జీలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారిగా నీలిమ



కలెక్టర్‌ను కలిసిన గిరిజన సంక్షేమాధికారి

సంగారెడ్డి జోన్: జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా నీలిమ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

మూడు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు మంజూరు

జహీరాబాద్: జిల్లాకు మూడు కొత్తగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరయ్యాయి. మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలోని మోతీమాత ఆలయం వద్ద కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. మునిపల్లి మండలంలోని పెద్ద చల్మెడ, రాయికోడ్ మండలంలోని చిమ్నాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం ఈ మేరకు మంజూరు చేసింది.

అర్హులైన పేదలకే డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి



డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలందరికీ పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఈ మేరకు సంగారెడ్డిలో సీపీఎం నాయకులు డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జహీరాబాద్‌లో పేదల ఇళ్ల కోసం అనేక సార్లు ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో డబుల్ బెడ్రూంలు ఇచ్చినప్పటికీ ఇళ్ల తాళాలు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నారన్నారు. పేదలకు ఇళ్ల తాళాలు వెంటనే ఇవ్వాలన్నారు.

వదలని వాన.. తప్పని హైరానా

జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. నాలుగు రోజులుగా రాత్రీపగలూ తేడా లేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. దీంతో జనం బయట తిరిగేందుకు ఇబ్బందులు పడ్డారు. రెయిన్ కోట్లు వేసుకుని, గొడుగులు పట్టుకుని వెళ్లారు. శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన వారంతా తడిసిముద్దయ్యారు. మరోవైపు వానలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలన్నీ జలకళను సంతరించుకున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి









సంగారెడ్డి పట్టణంలో వర్షంలో తడుస్తూ వెళ్తున్న జనం

పరిహారం అందేదెన్నడో?

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఎదురుచూపులు



- భూసేకరణ ప్రక్రియ పూర్తయినా అందని డబ్బులు
- ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలే కారణమా?

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంతో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులకు పరిహారం పంపిణీలో జాప్యం జరుగుతోంది. భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ.. భూములు కోల్పోతున్న రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ కావడంలో అలస్యమవుతోంది. ఈ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో సంగారెడ్డి జిల్లా పరిధిలో సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, హత్నూర మండలాల పరిధిలో మొత్తం 13 గ్రామాల్లో భూములు కోల్పోతున్నారు. ఈ గ్రామాల్లో భూసేకరణ కోసం మొత్తం 24 అవార్డు ప్రకటించారు. ఇందులో ఇప్పటి వరకు సంగారెడ్డిటౌన్‌తో పాటు, ఇరిగిపల్లి, నాగాపూర్, తాళ్లపల్లి, కలబ్‌గూర్, కులబ్‌గూర్, దౌల్తాబాద్, సికింద్రాపూర్ గ్రామాల పరిధిలోని 16 అవార్డులకు నేషనల్ హైవే అథారిటీ నుంచి అప్రూవల్ కూడా వచ్చింది. ఇందులో కొన్నింటికి మే నెలలోనే అప్రూవల్ వచ్చినా ఇప్పటి వరకు నిర్వాసితుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి బ్యాంకు ఖాతాల వివరాలు, భూములు డాక్యుమెంట్లు.. వివరాలు కూడా తీసుకున్నారు. ఈ ప్రక్రియ అంతా ముగిసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ పరిహారం డబ్బులు మాత్రం నిర్వాసితుల ఖాతాల్లో జమ కాలేదు. పెద్దాపూర్, గిర్మాపూర్, కాసాల, దేవులపల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది భూసేకరణ అవార్డులకు నేషనల్ హైవే అథారిటీ నుంచి అప్రూవల్ రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. అయితే అప్రూవల్ వచ్చి అవార్డులకు సంబంధించిన డబ్బులు కూడా జమ కాకపోవడంతో నిర్వాసితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

సాంకేతిక సమస్యలు..

పరిహారం పంపిణీలో ఆలస్యం కావడానికి భూసేకరణకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు టెక్నికల్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. పరిహారం పంపిణీకి నిధుల కొరత లేదని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పేర్కొంటున్నారు. టెక్నికల్ సమస్య పరిష్కారం కాగానే నిధులు జమ చేస్తామని చెబుతున్నారు. ఈ పరిహారం నిధులు భూసేకరణ అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓలు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ జాయింట్ ఖాతాల్లో నిధులు జమ చేయాల్సి ఉంటుంది. పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక సమస్య కారణంగా ఈ నిధులు ఈ జాయింట్ ఖతాలో జమ కాలేదని అధికారులు చెబుతున్నారు.

నిధులు రాగానే జమ చేస్తాం

భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ అంతా పూర్తయింది. నేషనల్ హైవే అథారిటీ నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు వచ్చిన వెంటనే భూములు కోల్పోతున్న రైతుల ఖతాల్లో పరిహారం డబ్బులు జమ చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి ఆర్డీఓ

భూ సేకరణ వేగిరం చేయండి



నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో అదనపు కలెక్టర్ మాధూరి తదితరులు

- కలెక్టర్ ప్రావీణ్య
- నిమ్జ్ భూముల పరిశీలన

ఝరాసంగం(జహీరాబాద్): నిమ్జ్ భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చీలపల్లి తండాలో సేకరించిన భూములను అదనపు కలెక్టర్ మాధూరి, ఆర్డీఓ రాంరెడ్డితో కలిసి పర్యటించారు. ఇప్పటి వరకు సేకరించిన భూ వివరాలతో పాటు ఇంకా సేకరించాల్సిన వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా నిమ్జ్ కోసం ఏర్పాటు చేసిన రహదారిని పరిశీలించారు. మొదటి దశలో 3,240 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 2,888 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. నిమ్జ్ ప్రాజెక్టు మ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులతో మాట్లాడి మిగతా భూమిని సేకరించాలన్నారు. నిమ్జ్ పూర్తి అయితే పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి రాంరెడ్డి, తహసీల్దార్ తిరుమలరావు, ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే విధంగా బోధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని బర్దీపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జహీరాబాద్: మండలంలోని తూంకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి బీరప్పను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వెంచర్ అనుమతుల్లో అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. వచ్చిన ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసు ఇచ్చారని, ఇందుకు సరైన వివరణ లేకపోవడంతో విచారణ జరిపించగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు తేలిందన్నారు. ఈ మేరకు సస్పెండ్ చేశారని తెలిపారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పేద వర్గాలకు కేవలం కాంగ్రెస్ హయాంలోనే రేషన్ కార్డులు అందాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నాగల్‌గిద్ద మండలానికి నూతనంగా మంజూరు అయిన 371 రేషన్ కార్డులను శుక్రవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సక్రునాయక్ తండాలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి దశ బేస్‌మెంట్ బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరూ కడుపునిండా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న లక్ష్యంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. కార్డులు ఉన్న వారికి పిల్లలు పుట్టినా వారి పేర్లను కూడా చేర్చని దౌర్భాగ్యపు బీఆర్ఎస్ పాలన అని మండిపడ్డారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. నాగల్‌గిద్ద మండలం ఏస్గి గ్రామంలో గ్రామ స్వరాజ్యం సంస్థ ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠల్‌నాయక్, నారాయణ జాదవ్, మాణిక్‌రావు, అబ్దుల్ రహీం, మనోహర్ పాటిల్, అంజిరెడ్డి, నెహ్రూ నాయక్, బస్వరాజ్ పాటిల్, అనిల్ పాటిల్ పాల్గొన్నారు. ఖేడ్ మున్సిపాలిటీలోని 5వ వార్డుకు చెందిన పల్నాటి ప్రశాంత్‌కు రూ.19వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

ప్రశంసలు పొందిన సిందూర్ ఆపరేషన్

ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్



దాడులపై విద్యార్థులకు వివరిస్తున్న కల్నల్ రమేష్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ప్రపంచ దేశాల ప్రశంసలు పొందిందని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సిరియాల్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ సిరియాల్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రమూకలు ఏప్రిల్22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్ పర్యాటక ప్రాంతంలో విచక్షణారహితంగా పర్యాటకులపై కాల్పులు జరపడం వల్ల 25 మంది పర్యాటకులు ప్రాణాలను కోల్పోయారన్నారు. భారతదేశం వివిధ దేశాలతో దౌత్య పరంగా అనేక సమావేశాలు నిర్వహించి పాకిస్తాన్ చర్యలను ఎండగట్టేందుకు ప్రయత్నించిందని చెప్పారు. కానీ వాటన్నింటినీ పాకిస్తాన్ పట్టించుకోలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో భారత ప్రభుత్వం పహల్గావ్ ఉగ్రవాద చర్యకు ప్రతిఫలంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు వారి శిబిరాలను నేలమట్టం చేసిందన్నారు. కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఎన్సీసీ అధికారి డాక్టర్ విజయ, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీమతి నిర్మల, డాక్టర్ ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ కుమార్, ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇసుక రవాణా అడ్డగింత

- సరఫరా చేసే అవకాశం తమకే ఇవ్వాలి
- లారీల యజమానుల డిమాండ్

జహీరాబాద్: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు తీసుకువచ్చిన ఇసుక లారీలను స్థానిక లారీల యజమానులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా... శుక్రవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో ఇసుక డంప్‌కు అధికారులు నాలుగు లారీల ఇసుకను తెప్పించారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ప్రాంత ఇసుక లారీల యజమానులు అక్కడకు చేరుకుని లారీలను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో ఇసుక డంపింగ్‌కు ఇతరుల లారీలను అనుమతించబోమన్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, మైనింగ్ శాఖ ఏడీ రఘుబాబు, హౌసింగ్ పీడీ చలపతిరావు అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న లారీల యజమానులతో అధికారులు చర్చలు జరిపినా వారు ఒప్పుకోలేదు. జహీరాబాద్ ప్రాంతంలో 400 లారీల యజమానులు ఉన్నారని, వారందరి పొట్ట కొట్టవద్దని కోరారు. తాము తక్కువ ధరకే సరఫరా చేస్తామని , తమకే అవకాశం ఇవ్వాలన్నారు. లారీల యజమానులు ఇసుకను డంపింగ్ చేసేందుకు అంగీకరించక పోవడంతో విధిలేక అధికారులు అందోల్‌లోని ఇసుక డంప్‌నకు లారీలను తరలించారు. లారీల యజమానులు తమ సమస్యలపై ఆర్డీఓ రాంరెడ్డి, మైనింగ్ అధికారి రఘుబాబులకు వినతి పత్రం ఇచ్చారు.



అధికారులను నిలదీస్తున్న లారీ యజమానులు

కల్లు దుకాణాలపై దాడులు ఆపాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

సంగారెడ్డి టౌన్: కల్లు దుకాణాలపై శాంపిల్ పేరుతో ఎక్సైజ్ అధికారుల దాడులు ఆపేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఈత, తాటి చెట్ల పెంపకాలకు ప్రోత్సహించాలని కోరారు. ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌడ్ ఉపాధ్యక్షుడు అంజా గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడమే లక్ష్యం



జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం, అధికారులు

పటాన్‌చెరు టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడం, మహిళలకు సాధికారత కల్పించి పేదరికాన్ని తగ్గించడం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ముఖ్య ఉద్దేశమని జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ సభ్యుడు సృజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్డారం గ్రామంలో ఎన్ఆర్‌ఎల్‌ఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలతో మాట్లాడి కేంద్ర పథకాలపై ఆరా తీశారు. అలాగే పెన్షన్ అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఎంపీడీవో యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, డిప్యూటీ ఈఈ తదితరులు సన్మానించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు శిక్షణ



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

గజ్వేల్‌రూరల్: ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో గజ్వేల్‌లోని బాలుర హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొననున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రతియేటా జనవరి 26న దేశ రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు పరేడ్‌లో పాల్గొంటారని చెప్పారు. ఇందులో భాగంగానే గజ్వేల్ ఎన్‌సీసీ విభాగం 33వ తెలంగాణ సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో పలువురు క్యాడెట్లను ఎంపిక చేశామని, ఈ సందర్భంగా వారికి ఆర్మీ అధికారులు శిక్షణ ఇస్తున్నట్లు లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డి తెలిపారు.

క్రీడా ప్రాంగణం ఆక్రమణ.. కేసు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ క్రీడా ప్రాంగణాన్ని ఆక్రమించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొల్లారం పట్టణ పరిధిలోని 254 సర్వే నంబర్లోని ప్రభుత్వ క్రీడా స్థలాన్ని స్థానికులు రాజ్ గోపాల్, జితయ్య, ప్రవీణ్ క్రీడా ప్రాంగణంలో అక్రమంగా కంటైనర్‌ను ఏర్పాటు చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అధికారులు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డును ధ్వంసం చేసి తొలగించారు. ఈ వ్యవహారంపై జిల్లా యువజన క్రీడా శాఖ సీనియర్ అసిస్టెంట్ అభినవ్ కుమార్ శుక్రవారం బొల్లారం సీఐ రవీందర్ రెడ్డికి ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఒకరిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలో ఒకరిపై కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని పెద్దతండా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్. ప్రశాంత్ వివరాల ప్రకారం... తండాకు చెందిన గుగులోతు కోమ, మంక్య భార్యాభర్తలు. కాగా భూ వివాదంలో కాశబోయిన అశోక్ వీరిపై దాడికి పాల్పడినట్లు కోమ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొండెంగ దాడి.. గాయాలు

జహీరాబాద్: పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరు రోగులపై కొండెంగలు దాడి చేయడంతో గాయపడ్డారు. శుక్రవారం పట్టణానికి చెందిన అబ్దుల్ ఖాదర్, అక్రం అలీలు వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చారు. ఆవరణలో ఉన్న కొండెంగలు వారిపై దాడి చేయడంతో కాలికి కుట్లు పడ్డాయి. ఆస్పత్రి ఆవరణలో సంచరించే కొండెంగలను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని వీరన్నపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన పొన్నబోయిన ప్రభాకర్ తన పాడి గేదెను రోజులాగే బావి వద్ద తీసుకెళ్లి మేత మేపుతుండగా విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

లగ్గానికి వేళాయె..

నేటి నుంచి జోరుగా పెళ్లిళ్లు

- నవంబర్ 26 వరకు శుభ ముహూర్తాలు
- ఇక 4 నెలలు లగ్గాలే..లగ్గాలు
- ఉమ్మడి జిల్లాలో 1.10 లక్షలకుపైగా జరగనున్న వివాహాలు
- ఫంక్షన్‌హాల్స్, టెంట్‌హౌస్‌లకు, బ్యాండ్ మేళాలకు డిమాండ్



దుబ్బాక : సరిగ్గా 80 రోజుల విరామం తర్వాత మళ్లీ శుభకార్యాలకు మంచి ముహూర్తాలు వచ్చాయి. దీంతో జోరుగా పెళ్లి బాజాలు మోగనున్నాయి. శ్రావణమాసం శుభకార్యాలకు శ్రేష్ఠం కావడంతో నేటి నుంచి నవంబర్ 26 వరకు 35 మంచి ముహూర్తాలు ఉండటంతో జోరుగా లగ్గాలు జరగనున్నాయి. వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు జరగనున్నాయి. మే 25 నుంచి జులై 26 వరకు ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం శుభ ముహూర్తాలు ఉండటంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడ చూసినా పెళ్లి శోభ సంతరించుకొంది.

నేటి నుంచి నవంబర్ 26 వరకు..

నేటి నుంచి నవంబర్ 26 వరకు 4 నెలల పాటు పెళ్లి బాజాలు మోగనున్నాయి. జులై 26, 27, 30, 31తోపాటు ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, 20 తేదీల్లో, సెప్టెంబర్‌లో 24, 26, 27, 28వ తేదీల్లో, అక్టోబర్‌లో 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31వ తేదీల్లో, నవంబర్‌లో 1, 2, 7, 8, 12, 13, 15, 22, 23, 26వ తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మొత్తం నాలుగు నెలల్లో 35 ముహూర్తాలు ఉండటంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారుగా లక్షా 10 వేలకు పైగా వివాహాలు జరగనున్నాయి. సిద్దిపేటలో 40 వేలు, సంగారెడ్డిలో 45 వేలు, మెదక్ జిల్లాల్లో 25 వేలకు పైగా పెళ్లిలు జరగనున్నాయని వేదపండితులు తెలిపారు.

బ్యాండ్, డెకరేషన్, ఫొటోగ్రాఫర్లకు డిమాండ్

వివాహాలు జరగుతుండటంతో పంతుళ్లు, బ్యాండ్ మేళాలు, టెంట్ హౌస్‌లు, డెకరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లకు చాలా డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇతర చోట్ల నుంచి తగిన సామగ్రిని, మనుషులను అద్దెకు తెచ్చుకుంటున్నారు. పెళ్లి చేసే వారు వీటికి ముందుగానే అడ్వాన్స్ ఇచ్చారు. ఇక పంతుళ్లు సైతం గ్రామాలు , పట్టణాల్లో ఎక్కువగా పెళ్లి ముహూర్తాలు పెట్టడంతో ఇతర గ్రామాల్లోని వారి బంధువులను రప్పించుకుంటున్నారు.

ముహూర్తాలను దృష్టిలో పెట్టుకుని..

నాలుగు నెలల పాటు పెళ్లీలు జరగుతుండటంతో ఫంక్షన్‌హాల్స్‌కు డిమాండ్ నెలకొంది. ఇప్పటికే పెండ్లీ ముహూర్తాలు నిర్ణయించుకున్న పెళ్లి చేసే కుటుంబాలు 2 నెలల ముందరే ఫంక్షన్‌హాల్స్ బుక్ చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్స్ 3500కు పైగా ఉండగా ప్రభుత్వ(టీటీడీ), కమ్యూనిటీ హాల్స్ మరో 5000 కు పైగా ఉన్నాయి. దీంతో చాలా మందికి ఫంక్షన్ హాల్స్ దొరక్కపోవడంతో ఇండ్ల వద్ద , ఖాళీ స్థలాల్లో వివాహాలు చేయనున్నారు.



ఉమ్మడి మెదక్ జిల్లాలో..



శ్రావణమాసం ప్రారంభం కావడంతో నేటి నుంచి నవంబర్ 26 వరకు వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారుగా లక్షా 10 వేలకు పైగానే జంటలు ఒకటి కానున్నాయి. ఇప్పటికే 300 లకు పైగా పెళ్లీలకు ముహూర్తాలు పెట్టాను. 80 రోజుల విరామం తర్వాత 4 నెలలకు పైగా శుభ ముహూర్తాలు ఉండటంతో వేల కొత్త జంటలు వివాహంతో ఒక్కటవుతున్నాయి.

– వేలేటి జయరామశర్మ, వేద పండితులు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు

రెండు నెలల ముందే బుక్



పెళ్లీలకు ఫంక్షన్‌హాల్స్ రెండు నెలల ముందే బుక్ అయ్యాయి. జులై, ఆగష్టు,సెప్టెంబర్‌లో జరిగే వివాహాలకు ముందు జాగ్రత్తగా చాలా మంది బుక్ చేసుకున్నారు. ఇంకా ఫంక్షన్‌హాల్స్ కావాలని వస్తున్నారు. కానీ, ఇప్పటికే బుక్ అయ్యాయని చెబుతుండటంతో ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

– కోమటిరెడ్డి రజనికాంత్‌రెడ్డి, ఫంక్షన్‌హాల్ యజమాని, దుబ్బాక

టెంట్‌హౌస్‌లకు ఫుల్ గిరాకీ



పెళ్లీల సీజన్ కావడంతో ముందుగానే టెంట్‌హౌస్ సామగ్రిని బుక్ చేసుకుంద్రు. ఎక్కువ ఆర్డర్స్ వస్తున్నాయి. సుమారు 80 రోజులు శుభకార్యాలు లేకపోవడంతో ఖాళీగా ఉన్నాం. ప్రస్తుతం పెళ్లీ ముహూర్తాలు ఉండటంతో టెంట్‌హౌస్‌లకు గిరాకీ ఉంది.

– దయాకర్‌రెడ్డి, టెంటుహౌస్ యజమాని

హోటల్ సీజ్

కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నందుకే..



హోటల్‌ను తనిఖీ చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలోని హోటళ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు హోటళ్లలో పరిశుభ్రత పాటించకుండా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. పోలీస్ బొమ్మ చౌరస్తాలో గల రాజస్థాన్ హోటల్‌లో కుళ్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తుండటంతో సీజ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయించవద్దని, అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది కృష్ణ, మల్లేశం, శ్రీను,అరవింద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తొగుట(దుబ్బాక): ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బండారు చిన్న మహేష్ (35)కు భార్య లత, కూతుర్లు ప్రవళిక (9), మనుదీపిక (5) ఉన్నారు. భార్యాభర్తలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో పిల్లల చదువులకు, కుటుంబ అవసరాల కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారు బాకీ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చారు. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకోగా.. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

కార్డెన్ సెర్చ్‌లో 54 బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

వర్గల్(గజ్వేల్): శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గౌరారం, ములుగు, జగదేవపూర్, మర్కూక్, గజ్వేల్ ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, విజయ్ కుమార్, కృష్ణారెడ్డి, దామోదర్, ఎస్ఐ రఘుపతి బృందాలుగా విడిపోయి గ్రామంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, నిషేధిత మత్తు పదార్థాలపై ఆరా తీశారు. సరైన ధృవపత్రాలు లేని 54 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... కార్డెన్ సెర్చ్‌తో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకునే అవకాశముంటుందన్నారు. అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలు గమనిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని, సైబర్ నేరం జరిగితే 1930, లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల మందను తప్పించబోయి..

– డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

చేగుంట(తూప్రాన్): డీసీఎంను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటన పొలంపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ... మెదక్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ డీలక్స్ బస్సు మెదక్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుంది. ఈ క్రమంలో పొలంపల్లి చెరువు సమీపంలో గొర్రెల మంద రోడ్డుపైకి రావడంతో తప్పించబోయి డ్రైవర్ బస్సును పక్కకు తిప్పడంతో ముందు వెళుతున్న డీసీఎంను ఢీకొట్టాడు. బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు.

విద్యార్థిని అదృశ్యం

గజ్వేల్‌రూరల్: ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహర్‌నగర్ పరిధిలోని అరుంధతినగర్ కాలనీకి చెందిన కలాల్ లావణ్య పట్టణంలోని బాలికల హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ఫైనలియర్ చదువుతుంది. గురువారం కళాశాలకు వెళ్లిన లావణ్య తిరిగి రాలేదు. దీంతో సదరు హాస్టల్ వార్డెన్ విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు తెలిసిన చోట వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో విశ్వంత్ అనే యువకునిపై అనుమానమున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ఇసుక లారీలు సీజ్

చిన్నకోడూరు(సిద్దిపేట)/ సిద్దిపేటకమాన్ : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వివరాలు... శుక్రవారం చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో, సిద్దిపేట టూటౌన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రెండు ఇసుక లారీలను పట్టుకున్నారు. ఈ మేరకు వాటిని సీజ్ చేసినట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

పది మంది మహిళా కూలీలకు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్) : రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దొంతి చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా... వెల్దుర్తి మండలం శేరీల గ్రామానికి చెందిన సుమారు పదిమంది కూలీలు అదేగ్రామానికి చెందిన ఓ యువకుడి ఆటోలో శివంపేట మండలంలోని బిజిలీపూర్‌లో వరినాట్లు వేయడానికి వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వెళుతుండగా మండల పరిధిలోని దొంతి చౌరస్తా సమీపంలో తూప్రాన్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళా కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పోలీసులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పారిపోతుండగా నర్సాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

పేలుడు పదార్థాలు, ట్రాక్టర్ సీజ్

ముగ్గురిపై కేసు నమోదు

తూప్రాన్: అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బండరాళ్లు పేల్చుతున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... మండలంలోని గుండ్రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని గౌడిగూడెంకు చెందిన రాంచంద్రారెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బండరాళ్లు పేల్చుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పేలుడు పదార్థాలు, ట్రాక్టర్‌తో పాటు పేలుళ్లకు పాల్పడుతున్న భిక్షపతి, బొల్లబోయిన నర్సింలు, అంబపురం రాజులపై కేసు నమోదు చేశారు.

ఆయుర్వేదంతో మేధోశక్తి పెరుగుదల

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



విద్యార్థులకు చుక్కలు వేస్తున్న బక్కి వెంకటయ్య

దుబ్బాకరూరల్: ఆయుర్వేద ఔషధ చుక్కలు 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు వేయడం వల్ల జ్ఞాపక శక్తిని పెంపొందిస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. అక్బర్‌పేట – భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమంలో బాలయోగి రాములు మహారాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వర్ణామృతం ప్రాశన ఆయుర్వేద ఔషధ చుక్కలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. రోగనిరోధక శక్తిని పెంచుతుందని, శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అలాగే చీకోడ్ గ్రామంలో లోహిత్ సాయి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్ పాల్గొన్నారు.

బాబును ఇవ్వాలని మహిళకు బెదిరింపులు

క్షేమంగా సొంత గ్రామానికి పంపించిన పోలీసులు



బాబుతో కోమల

హుస్నాబాద్: చిన్న బాబుతో భిక్షాటన చేస్తున్న ఓ మహిళను రూ.500 ఇచ్చి బాబును ఇవ్వా లని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. ఈ ఘటన శుక్రవారం హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని తెలంగాణ కాంప్లెక్స్‌లో తన బాబుతో ఓ మహిళ భిక్షాటన చేస్తున్న సమయంలో బాబును ఇవ్వాలని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన ఆ మహిళ బాబుతో ఏడ్చుకుంటూ బస్టాండ్‌కు చేరుకుంది. ఇది గమనించిన ప్రయాణికులు బస్టాండ్ సెక్యూరిటీ గార్డు వెంకటేష్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు చెప్పారు. వెంటనే అక్కడికి వచ్చిన బ్లూ కోట్ సిబ్బంది కుమార్, సంపత్ మహిళ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరిగొప్పుల గ్రామానికి చెందిన కోమలగా గుర్తించారు. వెంటనే మహిళను, ఆమె బాబును బస్టాండ్ నుంచి వయా తరిగొప్పుల మీదుగా జనగామ వెళ్లే బస్సు ఎక్కించి ఆ గ్రామానికి వెళుతున్న ప్రయాణికులకు చెప్పి పంపించారు. గ్రామానికి మహిళ చేరుకునే వరకు ఎస్సై లక్ష్మారెడ్డి మానిటరింగ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించండి

డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ధనరాజ్

సిద్దిపేటకమాన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ వైద్య సిబ్బందికి సూచించారు. సిద్దిపేట నాసర్‌పూర అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌లో రక్తపరీక్షలు, ఫార్మసీ గదిలోని మందుల నాణ్యతకు సంబంధించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ..సీజనల్ వ్యాధుల నివారణలో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, దీనిపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీలో కుక్కకాటు, పాము కాటుకు సంబంధించిన వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

మునిపల్లి(అందోల్): పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సంబంధిత కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల మెయింటెనెన్స్, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఇన్వెస్టిగేషన్‌లో ఎలాంటి సందేహాలున్నా సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సీహెచ్‌ఓకు సూచించారు. సస్పెక్ట్, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. నైట్ బీట్, పెట్రోలింగ్ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. మన చుట్టూ జరుగుతున్న అసైడ్ మోసాలు, బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాల గురించి కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఇన్‌చార్జి బక్కన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ వి.నవీన్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కాలనీ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు రైడ్ చేసి పోచమల్ల రాముని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 122 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా హైదరాబాద్ అన్నసాగర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి దగ్గర కొనుగోలు చేసి తీసుకొచ్చానని చెప్పాడు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

మునిపల్లిలో 1.250 గ్రాములు

మునిపల్లి(అందోల్): గంజాయి తీసుకువస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి వివరాల ప్రకారం... శుక్రవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయికోడ్ మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డే నర్సింహులు బైక్‌లో, కొండాపూర్ మండలం గారకూర్తి గ్రామానికి చెందిన వి.వెంకట్‌రెడ్డి కారులో దగ్గర 1.250 గ్రాముల గంజాయి దొరికింది. బీదర్‌లోని ఇరాని గల్లీలో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి తీసుకువస్తున్నారు. వెంకట్ రెడ్డి గత సంవత్సరం నుంచి నర్సింహులు దగ్గర అవసరమైనప్పుడు వెళ్లి గంజాయిని తీసుకుంటున్నాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి బైక్, కారు, 1.250 గ్రాముల గంజాయి, 9,500 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పురుగుల అన్నం తినేదెట్లా?

విద్యార్థుల ఆందోళన

- హాస్టల్‌ను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

సంగారెడ్డి : తాము తింటున్న అన్నం బాగాలేదని, అందులో పురుగులు వస్తున్నాయని బొమ్మరెడ్డి గూడెం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. వారం రోజులుగా భోజనంలో పురుగులు వస్తున్నాయని తమ సమస్యను వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పురుగులతో కూడిన అన్నం కాకుండా నాణ్యమైన భోజనం వడ్డించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్ వైఖరిపై మండిపడ్డారు. గిరిజన పాఠశాల విద్యార్థుల ఆందోళనపై స్పందించిన మండల స్పెషల్ ఆఫీసర్ వసంత కుమారి, ఎంపీడీఓ శంకర్ పాఠశాలను సందర్శించారు. సివిల్ సప్లై బియ్యంలో పురుగులు ఉన్నాయని నిర్ధారించి వాటిని వాపస్ చేసి కొత్త బియ్యంతో అన్నం వండించారు. ఇకపై నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే హాస్టల్ వాతావరణం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.



వంటలను పరిశీలిస్తున్న వసంత కుమారి, ఎంపీడీఓ శంకర్

గిరిజన పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

సంగారెడ్డి జోన్: చౌటకూర్ మండలంలోని బొమ్మరెడ్డి గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ శోభను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు బియ్యం శుభ్రం చేయకుండా వంటలు చేసి వడ్డించడంతో అన్నంలో పురుగులు వస్తున్నట్లు విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేశారు. దీంతో విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. విచారణ జరిపి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. వార్డెన్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలడంతో సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.